రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## ఆర్డీఓ కార్యాలయంలో ఇకపై ప్రతి సోమవారం ప్రజావాణి

**-సమస్యలు పరిష్కరించుకోవాలన్న చేవెళ్ళ ఆర్డీఓ పార్థసారథి**

**చేవెళ్ల, మే 2, ప్రభాతవార్త:**

చేవెళ్ల డివిజన్ పరిధిలో ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, చేవెళ్ల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయంలో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. డివిజన్‌పరిధిలోని అన్నిశాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు (డిఎల్పిఓ, డిప్యూటీ డిఎంహెచ్ఓ, ఎడిఎ, డిఈ టిజిడిఐఎస్ సిఓఎం), డిఈఈ(ఆర్‌బి), డిఈఈ(ఆర్‌డబ్ల్యుఎస్ఎస్), డిఈఈ(హౌసింగ్), సిడిపిఓ, ఎఎస్ సిడిఓ, ఎటిడిఓ, ఎంఎ డబ్ల్యుఓ) తప్పనిసరిగా హాజరై ఫిర్యాదులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణచర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజలు సమస్యల తెలిపి పరిష్కరించుకోవాలని తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

**-సమస్యలు తీర్చకుంటే 2 రోజుల్లో దీక్ష: సిఐటియు**

**ఘట్‌కేసర్, మే 2, ప్రభాతవార్త:**

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు నాయకులు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ (స్థానిక సంస్థలు)ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ మండల సిఐటియు కార్యదర్శి చింతల యాదయ్య, సిపిఎం మండల కార్యదృ నార్కల్‌పల్లి సభిత, మండల కమిటీ సభ్యులు వై.చంద్రమౌళీలు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఎసిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఘట్‌కేసర్‌సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వారు తెలిపారు. జిహెచ్ఎంసిని విలీనం చేసినప్పటి నుంచి నేటి వరకు మున్సిపల్ వేతనాలు మాత్రమే ఇస్తున్నారని, కార్మికులకు జిహెచ్ఎంసి వేతనాలు ఇవ్వాలని, ఈసమస్యలు పరిష్కరించకుంటే రెండు రోజుల్లో దీక్ష చేపడుతామని వారు స్పష్టంచేశారు.

## ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయండి

**-బహిరంగ సభ సన్నాహక సమావేశంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

**రంగారెడ్డి జిల్లా అర్బన్, మే 2, ప్రభాతవార్త:**

పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 10న జరిగే ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగసభకు పెద్దఎత్తున బిజెపి నేతలు తరలివెళ్లి విజయవంతం చేయాలని బిజెపి జాతీయ ఓబిసి మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం శంషాబాద్ మండలంలోని తొండుపల్లిలోని మనస్వి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి డాక్టర్ లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తున్నదని తెలిపారు. జాతీయ రహదారులు ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉదారంగా నిధులు కేటాయిస్తుందని తెలిపారు. రైల్వే పనుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రానికి 8వేల కోట్లకు పైగా నిధులు కేటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నదని తెలిపారు. సికింద్రాబాద్ నాంపల్లి రైల్వేస్టేషన్లతోపాటు మొత్తం 45 రైల్వే స్టేషన్లను అమృత రైల్వేస్టేషన్‌లాగా తీర్చిదిద్దుతున్నదని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలలో బిజెపి అధికారంలోకి రాబోతున్నదని, ఈవిజయం కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, ప్రేమేందర్‌రెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, అందెల శ్రీరాములు, అందె బాబయ్య, బాతుకు శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, కొమురయ్య, మల్లేష్ యాదవ్, వడ్డే చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర పదాధికారులు, జిల్లా పదాధికారులు, డివిజన్ల ఇన్చార్జిలు, మండల, డివిజన్, మునిసిపల్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను బాయ్‌కాట్ చేసిన ఎమ్మెల్యే

**కీసర, మే 2, ప్రభాతవార్త:**

మేడ్చల్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బాయ్‌కాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 నిమిషాలకు కార్యక్రమం అని చెప్పి ఇప్పటివరకు కార్యక్రమం మొదలుపెట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన కార్యక్రమం ఎమ్మెల్యేలతో నిర్వహించాలని అన్నారు. అధికారులు కనీసం స్థానిక ఎమ్మెల్యే అయిన నాకు విలువలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. నేను స్థానిక ఎమ్మెల్యేను కనీసం 5 చెక్కులను అయినా పంపిణీ చేస్తానని అధికారులను కోరినా, ఎమ్మెల్యే మల్లారెడ్డి మాటను పట్టించుకోకుండా అధికారులు వెళ్లిపోయారు.

## సర్వరోగ నివారిణి యోగ..!

**-యావత్ ప్రపంచానికి యోగాను అందించిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుంది.**

**-12వ యోగా దినోత్సవంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం**

**-వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రులు, ఎంపిడికె అరుణ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



కన్హ శాంతివనంలో యోగా వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**నందిగామ, మే 2, ప్రభాతవార్త:**

భారతదేశం సంస్కృతి, ప్రాచీన యోగకు పుట్టినిల్లు. యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత భారత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుందని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హ శాంతి వనంలో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆయుష్ మినిస్ట్రీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవనశైలిలో యోగ ఒక నిరంతర ప్రక్రియని ఆయన పేర్కొన్నారు. భారతదేశ ఆత్మను, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిన భారత ఔన్నత్యం వెలకట్టలేనిదన్నారు. జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం దేశానికే గర్వకారణం అన్నారు. 51 రోజుల యోగ కౌంట్ డౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుమారు 7000 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రతాప్‌గౌడ్‌జాదవ్, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, హార్ట్‌ఫుల్‌నెస్ గైడ్ దాజి, పలువురు రాజకీయ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాపాలన

**-జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరీ**



స్టాల్‌లను పరిశీలిస్తున్న అధికారులు

**కొడంగల్, మే 2, ప్రభాతవార్త:**

ప్రజాసమస్యల పరిష్కరమే లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగుతున్నదని, పాలనలో పారదర్శకతతో ప్రగతిప్రణాళిక అని జిల్లా అదనపుకలెక్టర్ రాజేశ్వరీ అన్నారు. శనివారం పట్టణంలోని మురారి ఫంక్షన్‌హాల్‌లో ఎంపిడిఓ ఉషశ్రీ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక నియోజక వర్గ స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్న తీరును ప్రజలకు వివరించేందుకు ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కడా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేస్తూ రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకుగాను సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకదృష్టి సారించారని అన్నారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత ఏర్పడుతుందని, ఇసుక సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, చెర్వు అభివృద్ధిచర్యలు తీసుకోవాలని అధికారులదృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులు తమతమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశానికి ముందు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను అదనపు కలెక్టర్, కడా ప్రత్యేక అధికారి పరిశీలించారు. సమావేశంలో జిల్లాల గ్రంథాలయసంస్థ చైర్మన్‌లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్‌లు నందారం ప్రశాంత్, నాగులపల్లి నరేందర్, ఎఎంసి చైర్మన్ అంబయ్యగౌడ్, నర్సిములుగౌడ్, వివిధమండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులతోపాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాపాలన

**-అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపట్టిని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం తోపాటు, ప్రజల అవసరాలను స్థానికంగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడం కోసమే 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టడంజరిగిందని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వికారాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం వికారాబాద్ పట్టణంలోని సత్య భారతి ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు రాష్ట్రప్రజలకు అందాలనే లక్ష్యంతో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళికను ప్రారంభించిందని తెలిపారు. ఎన్నికలప్రచారంలో ఇచ్చిన హామీమేరకు మహాలక్ష్మీపథకంలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్‌సిలెండర్ ఇస్తున్నామని, గృహజ్యోతి పథకంలో పేదల ఇళ్ళకు ఉచితంగా కరంటు వస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వహాస్టళ్ల పిల్లలకు 40శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మోటిక్‌చార్జీలు పెంచామమని గుర్తు చేశారు. ఈయేడాదినుండి రాష్ట్రంలోని కుటుంబాలన్నింటికి భరోసా ఉండాలనే ఉద్యేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉదయం పూట అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి భూభారతిని తీసుకొచ్చామని, 90 ఏళ్ళ తరువాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను రీసర్వే చేయిస్తున్నామని అన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామాలు, కాలనీలలోని ప్రజలకు తెలియజేయాలని గ్రామసర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు సూచించారు. వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధిచేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు అందరూ ప్రభుత్వ సమావేశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 200 కోట్లతో 20 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కాలేజీ నిర్మాణం వేగంగా జరుగుతుందని అన్నారు. ప్రతి మండలంలో ఒక పబ్లిక్‌స్కూల్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావిస్తోందని, అందులో భాగంగా ఇప్పటికే మర్పల్లి మండల కేంద్రానికి ఒక పబ్లిక్‌స్కూల్ మంజూరు చేసినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, 99 రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా గ్రామసభలు, మండలసభలు, నియోజకవర్గసభ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతిగ్రామ పంచాయతీకి ప్రభుత్వ ఆదేశాల మేరకు బోర్వెల్స్ మంజూరు చేసామని, 594 గ్రామా పంచాయతీలలో ప్రభుత్వం అందిస్తున్న ప్రతిస్కీంను అమలు చేస్తున్నామని అన్నారు. మంజురైన నిధులతో అసంపూర్తిగా ఉన్న స్కూల్‌భవనాలను పూర్తి చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడకూడా రోడ్డుప్రమాదాలు జరుగకుండా అలైవ్ అరైవ్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించామన్నారు. ఈసమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, జడ్పి సిఈఓ సుదీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, ఎంపిడిఓ వినయ్‌కుమార్, మున్సిపపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్‌రెడ్డి, వికారాబాద్, మర్పల్లి ఎఎంసి చైర్మన్లు చాపల శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా సెషన్స్ కోర్టుహాల్ ప్రారంభం

**-రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్**

**-పాల్గొన్న పలువురు న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్**



కోర్టుహాల్‌ను ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు కె.లక్ష్మణ్, హైకోర్టు న్యాయమూర్తులు, కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 2, ప్రభాతవార్త:**

మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతన జిల్లా సెషన్ కోర్టు హాల్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్, పలువురు హైకోర్టు న్యాయమూర్తులతో, జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. శనివారం మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన జిల్లా సెషన్ కోర్టు హాల్‌ను ప్రారంభించారు. దీనిలో ఆయనతో పాటు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.విజయ సేన్‌రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జిల్లా కలెక్టర్ మనుచౌదరిలు పాల్గొన్నారు. పలువురు న్యాయమూర్తులు, కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తరువాత నిర్మించిన కోర్టు హాల్‌లో ఏర్పాటుచేసిన సౌకర్యాలను, న్యాయమూర్తులఛాంబర్‌లను వారు పరిశీలించారు. పెరుగుతున్న కేసుల దృష్ట్యా కక్షిదారులకు, న్యాయవాదులకు మెరుగైన వసతులు కల్పించటంతోపాటు న్యాయ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఈ నూతన కోర్టు హాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, కోర్టుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహామెహ్రా

**వికారాబాద్, మే 2, ప్రభాతవార్త:**

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా ఎస్పి, కలెక్టర్ నీట్ పరీక్షాకేంద్రాలను పరిశీలించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ విధానం ద్వారా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పరీక్షాకేంద్రంలోనికి ఎలాంటి డిజిటల్ పరికరాలు అనుమతించడం జరగదని, పరీక్షరాసే అభ్యర్థుల తనిఖీ సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రశ్నాపత్రాల రవాణాపై పోలీస్, రెవెన్యూ, తపాలా శాఖల అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు చేపట్టాలని, పరీక్షాకేంద్రాల వద్ద నిబంధనల ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్, పరీక్షాకేంద్రాలలో సిసికెమెరాలు ఏర్పాటు, పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాల తరలింపు నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పరీక్షాసమయంలో ఎలాంటి అంతరాయంలేకుండా విద్యుత్‌సరఫరా, వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యసిబ్బందిని నియమించి, ఓఆర్ఎస్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు.

**డివిజన్ స్థాయిలో ప్రజావాణి...**

**-జిల్లా కలెక్టర్**

ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి ప్రజావాణి కార్యక్రమ నిర్వహణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తిరస్కరణ, అందుకుగల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్‌లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు, అత్యవసర వైద్యసేవలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వచ్చే సోమవారంనుండి డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, డివిజన్ స్థాయి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దీపక్ తివారి కోరారు.

## బండమీదిపల్లిలో బంగారం చోరీ

**-తొమ్మిది గంటల్లోనే చోరి సొత్తు రికవరీ**

**-పోలీసులకు అభినందనలు తెలిపిన స్థానికులు**



పోలీసుల అదుపులో నిందితుడు

**పెద్దేముల్, మే 2, ప్రభాతవార్త:**

పెద్దేముల్ మండలం బండమీదిపల్లిలో చోటుచేసుకున్న బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఫిర్యాదు అందిన కేవలం తొమ్మిది గంటల వ్యవధిలోనే దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, బండమీదిపల్లి గ్రామానికి చెందిన నస్రీన్ బేగం అనే మహిళ మే 1వ తేది రాత్రి తన ఇంట్లోని బీరువాలో సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలను భద్రపరుచుకుంది. శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆమె ఇంటికి తాళంవేసి ఉపాధి పనులకు వెళ్ళింది. తిరిగి ఉదయం 9 గంటల సమయంలో వచ్చి చూడగా ఇంటితాళం తీసి ఉండటం గమనించి ఆందోళనతో లోపలికి వెళ్ళింది. బీరువా తెరిచి ఉండటంతోపాటు అందులో ఉన్న బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించిన ఆమె వెంటనే పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. గ్రామంలో ఏర్పాటుచేసిన సిసికెమెరాల ఆధారంగా దృశ్యాలను క్షుణ్ణంగాపరిశీలించారు. అదేసమయంలో గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ ఖాజపాషను గుర్తించి అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా తనే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన రెండుతులాల బంగారు ఆభరణాలను పోలీసులకు అప్పగించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై చట్టరీత్యా తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. చోరీ అయిన తొమ్మిది గంటల్లోనే కేసును ఛేదించడంతో పోలీసులకు స్థానికులు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం

**-పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి**

**పరిగి, మే 2, ప్రభాతవార్త:**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సూచన మేరకు రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని, బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తామని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముఖ్యనేతలతో కలిసి కెటిఆర్ నిర్వహించిన కీలక సమావేశంలో మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తూ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ముందుకు తీసుకెల్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో గట్టి పోటీనిచ్చామని, రాబోయే పరిషత్, కార్పొరేషన్ల ఎన్నిక ల్లోను బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని మహేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ కమిటీల ఎంపిక, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచనలు పాటిస్తామని మహేష్‌రెడ్డి తెలిపారు.



కెటిఆర్‌తో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

## చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**కీసర, మే 2, ప్రభాతవార్త:**

నిరుపేదలకు కళ్యాణలక్ష్మీ ఒక వరం లాంటిదని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని కీసరలోని కెబిఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆర్‌డిఓ రాజేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన 384మందికి కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీచేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు పేదకుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాపార్టీ అధ్యక్షులు వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ నరసింహ్మాయాదవ్, ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శిరీష, వివిధ మండలాల తహసీల్దార్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పిస్తున్న అశ్విని శ్రీనివాస్

## రామాయంపేటలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

**రామాయంపేట, మే 2, ప్రభాతవార్త :** రామాయంపేటకు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, ఎంపి ఎం. రఘునందన్‌రావులను రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఉద్యమ నేత పోచమ్మల అశ్విని‌శ్రీనివాస్ కలిసి రామాయంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు, అలాగే నియోజకవర్గ కేంద్రంగా పునరుద్ధరణకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మెదక్ కలెక్టరేట్ ప్రారంభోత్సవ సభలో రామాయంపేటను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఆర్డీవో కార్యాలయం పూర్తి స్థాయిలో పనిచేయడంలేదని పేర్కొన్నారు. ఆర్డీవోతోపాటు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో సాధారణ రెవెన్యూ పనులకోసం ప్రజలు మెదక్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రామాయంపేట అభివృద్ధి దిశగా ముందుకు సాగాలంటే తక్షణమే ఆర్డీవోను నియమించి, పూర్తిస్థాయి రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజనలో గతంలో కోల్పోయిన రామాయంపేటను తిరిగి నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేసి ప్రాంత అభివృద్ధికి దోహదం చేయాలని కోరారు.


## చౌటకూరులో జనగణనపై శిక్షణ ప్రారంభం



జనగణనపై శిక్షణ పొందుతున్న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు

**చౌటకూరు, మే 2, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జనగణన-2027 లో భాగంగా సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. తహసీల్దార్ ఎన్.కిష్టయ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లులకు పలు సూచనలు చేశారు. జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమన్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుని క్షేత్ర స్థాయిలో ఎలాంటి తప్పిదాలు లేకుండా డేటా సేకరణ చేయాలన్నారు. సరైన సమాచారం సేకరణతో ప్రభుత్వానికి ప్రజల అవసరలు, సమస్యలు స్పష్టంగా తెలిసి అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయడం సులభమవుతుందన్నారు. ఫీల్డ్ ట్రైనర్లు గోపికృష్ణ, లక్ష్మీనారాయణలు సూపర్‌వైజర్లకు, ఎన్యూమరేటర్లకు ప్రాక్టికల్ విధానాలు, ఫార్మాట్ నింపి విధానం డేటా నమోదు పద్ధతులపై సమగ్రంగా శిక్షణ అందించారు. శిక్షణలో ఆధునిక సాంకేతిక పద్ధతులు, మొబైల్ యాప్ వినియోగం, గణనలో ఎదురయ్యే సమస్యలు,పరిష్కారర మార్గాలపై వివరించారు.

## వైభవంగా మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు



మల్లికార్జున స్వామి జాతరలో ఎండ్ల బండ్లు తిరుగుతున్న దృశ్యం

**అల్లాదుర్గం, మే 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం జాతర ప్రధాన ఘట్టమైన ఎడ్ల బండ్ల ప్రదక్షిణ భక్తులను ఆకట్టుకుంది. అందంగా అలంకరించిన ఎడ్ల బండ్ల ప్రదక్షిణ ముందు యువకులు కేరితలు వేస్తూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఎడ్లబండి ముందు డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళు, శివసత్తుల నృత్యాలు, పోతారాజుల విన్యాసాలు జాతరకు హైలెట్‌గా నిలిచాయి. జాతర ఉత్సవాలను తిలకించేందుకు గడిపెద్దాపూర్ గ్రామస్థులతోపాటు పరిసరగ్రామాలైన ముస్లాపూర్, దాదాయపల్లి, బర్దిపూర్, బహిరన్‌దిబ్బ, పోతుల బొగుడ, బిజిలిపూర్, కేరూర్, రంసానిపల్లి, ఎర్రారం తదితర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూజలు (స్వామివారికి ఒడిబియ్యం, కుంకుమార్చన తదితర) నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి, ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.

## మెథడిస్ట్ క్రైస్తవ జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే



మెథడిస్ట్ క్రైస్తవ జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్యరావు

**జహీరాబాద్ మే 2 ప్రభాతవార్త :** పట్టణంలోని గార్డెన్‌నగర్, అల్లిపూర్ రెవ. జి బి గార్డెన్ మెమోరియల్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చిలో నిర్వహిస్తున్న మెథడిస్ట్ 96వ క్రైస్తవ జాతరను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే మాణిక్యరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 96 సంవత్సరాలుగా ఈ జాతర నిర్వహించడం జరుగుతున్నారు. ఈ కార్యక్రమంలో ఝరాసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, అల్లిపూర్ కౌన్సిలర్‌లు దీపక్, విజయరాజు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు శివప్ప పాస్టర్లు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ...

**జహీరాబాద్, మే 2(ప్రభాతవార్త):** అంగన్‌వాడీ టీచర్లకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో సేవలందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది పనితీరు మరింత సమర్థవంతంగా, వేగవంతంగా ప్రజలకు చేరేందుకు ఈ డిజిటల్ సదుపాయం ఉపయోగపడుతుందన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, గర్భిణీ స్త్రీల సంక్షేమం వంటి అంశాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుశీల, పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంఘం మండల అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, పట్టణ మాజీ అధ్యక్షుడు యాకూబ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు అబ్దుల్లా, గౌస్ గౌరీ, జాకీర్, దీపక్, విశ్వేశ్వర్, ప్రవీణ్, నాయకులు అక్బర్, ఫయాజ్, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 8.14 కోట్లు మంజూరు

### -పరిపాలన ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం




సింగూరు ప్రాజెక్టు దృశ్యం

**పుల్‌కల్, మే 3, ప్రభాతవార్త:** మండలంలోని ఎం బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులో మౌలిక వసతుల కల్పనకు 8.14 కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కార్యదర్శి శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లు హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్‌లను పేయింటింగ్‌లతో పాటు నిర్వహణ పనులకు పరిపాలన అనుమతి ఇస్తూ జీఓఆర్‌టీ 190 ద్వారా ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రాజెక్టుకు తక్షన మరమ్మత్తులు అవసరమని అందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఇంజనీర్ ఇన్ ఛీప్ గతంలో ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలతోకూడిన నివేదిక పంపారు. ఇంజనీరర్ ఇన్ చీఫ్ ప్రతి పాదనలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అన్నీ అంశాలపై క్షుణంగా పరిశీలించిన అనంతరం 8.14 కోట్ల నిధులు కేటాయించి పరిపాలన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. అంచనాలతోచేసిన కొలతలు, లీడ్‌లు, డేటాలు, కేటాయింపులకు సంగారెడ్డి చీఫ్ ఇంజనీర్ బాధ్యత వహిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజాగా సింగూరు ప్రాజెక్టు మౌలిక వసతుల కల్పన చర్యల ద్వారా ప్రాజెక్టు సామర్థ్యం మరింతగా పెరగనున్నది. రైతుల సాగు, ప్రజల తాగునీటి అవసరాలను నీటి సరఫరా సమర్థవంతంతా అందేలా మార్గం సుగమం కానున్నది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా ప్రత్యేక చొరవ తీసుకుని రూ. 8.14 కోట్లు మంజూరు చేయించారు. ఇప్పటికే ప్రాజెక్టు ఇరువైపుల 6 కిలో మీటర్ల రివిట్‌మెంట్ పనులు, ప్రధాన ఎడమ కాలువ సిమెంటు లైనింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. ఇటీవలనే ఆనకట్ట రివిట్‌మెంట్ పునరుద్దరణ పనులతోపాటు ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహా పరిశీలించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికల్లా ఆనకట్ట మరమ్మత్తు, సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యేలా వేగవంతం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ నిధులతో చేపట్టే పనులు నాణ్యతతో చేపడితే సింగూరు ప్రాజెక్టు పది కాలాల పాటు పదిలంగా ఉండనుంది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, మే 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. శనివారం సాయి బాబా ఫంక్షన్‌హాల్ వేదికగా నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పుల్‌కల్‌లో రైతు మంగిట్లో శాస్త్రవేత్తలు

**పుల్‌కల్, మే 2, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్‌రెడ్డి, డాక్టర్ చిరంజీవిలు పంటల సాగులో రైతులు పంటలో యూరియా, ఎరువులు, పురుగుమందుల వినియోగంలో పాటించాల్సిన పరిమిత పరిమాణం గురించి వివరించారు. పరిమిత పరిమాణంలో ఎరువులను వినియోగిస్తే సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని, మట్టికి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పచ్చి ఎరువు, పంటల విత్తనాల లభ్యత, ట్రాన్స్‌ఫ్లాంటింగ్ యంత్రాలకు సంబందించి సడ్సిడీలపై రైతులు శాస్త్రవత్తేలను ప్రశ్నించగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన కొత్త వరి రకాల విత్తనాలపై వివరించారు. డ్రిప్ ఎర్రిగేషన్, స్ప్రింక్లర్‌ల వాడకంతో నీటివృదా తగ్గుతుందని, పర్యావరణ రక్షణకు వృక్షా లను పెంచలని అవగాహన కల్పించారు. సరికొత్త పరిజ్ఞానం, సాంకేతికతలపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రవీణ్, ఏఈఓ బాగేష్ పాల్గొన్నారు.

### వెంకటాపూర్ గ్రామంలో...

**సదాశివపేట, మే 2 (ప్రభాతవార్త):** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పీజేటీఏయూ శాస్త్రవేత్త షేక్ అహ్మద్ హుస్సేన్ పాల్గొని రైతులకు పలు వ్యవసాయ సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన యూరియా సరైన వినియోగం, పంటలకు అవసరమైన సిఫార్సు మోతాదుల వినియోగం, జీవ ఎరువుల తయారీ విధానాలు, సుస్థిర వ్యవసాయం కోసం పంటల వైవిధ్య ప్రాముఖ్యత పై రైతులకు వివరించారు. రైతులు ఆధునిక సాంకేతికతలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్, ఎంఏఓ జి. శ్రీనివాస్, ఏఈఓ గీత, డి. క్రిష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, వార్డ్ సభ్యులు జనార్దన్, సురేష్, పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు



వారాహి మాతకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## ఘనంగా వారాహి మాత కుంభాభిషేక మహోత్సవం

**కొండపాక, మే 2, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల కేంద్రంలో వారాహి ప్రత్యంగిరా శరభేస్వార స్వామి విగ్రహా కుంభాభిసేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంటేరు యాదవరుడ్డి, బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కురుమ కుల దైవమైన బీరప్ప అక్క మహంకాళి దేవాలయన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

## ఎల్లాయిగూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం : సర్పంచ్



ఎల్లాయగూడలో బాల వికాస సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కొండపాక, మే 2, ప్రభాతవార్త :** గ్రామాన్ని అదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని సర్పంచ్ సున్నం సుదర్శన్ అన్నారు. శనివారం కుకునూరుపల్లి మండల పరిధిలోని ఎల్లాయగూడ సర్పంచ్ అధ్యక్షత బాల వికాస అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలవికాస సమావేశానికి ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తామన్నారు. బాల వికాస అదర్శ గ్రామ నిర్మాణ పథకం మేనేజర్ మంజుల మాట్లాడుతూ బాల వికాస సంస్థ 40 సంవత్సరాలుగా తెలంగాణలోనే కాకుండా 8 పొరుగు రాష్ట్రాల్లో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించి కొనసాగిస్తూ లక్షలాది మందికి లబ్ధి చేకూరుస్తుందన్నారు. గ్రామంలో స్థిరమైన మార్పు కోసం నాయకులంత కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడి టీచర్లు, అశ వర్కర్లు, పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మాసాయిపేటలో శనివారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, తేమశాతం, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ధాన్యాన్ని వేగవంతంగా రవాణా చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ దన్సింగ్, సర్వేర్ నరసింహులు, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ నర్సింలు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి

# సదాశివపేట పురపాలికలో కోఆప్షన్ సభ్యులు ఎన్నిక



నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న దృశ్యం

**సదాశివపేట, మే 2 (ప్రభాతవార్త):** సదాశివపేట పురపాలికలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ శనివారం ప్రశాంతంగా పూర్తైంది. మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించగా, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొత్తం కౌన్సిల్ సభ్యుల్లో 50 శాతం మంది హాజరైతే ఎన్నికల ప్రక్రియ నిర్వహించవచ్చని మున్సిపల్ కమిషనర్ శివాజీ సభ్యులకు వివరించారు. ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 27 మంది సభ్యులకుగాను 16 మంది హాజరుకావడంతో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు.పురపాలన అనుభవం కలిగిన సాధారణ కోఆప్షన్ సభ్యుల విభాగంలో పురుషుల కోటా నుండి మునిపల్లి సత్యనారాయణ, మహిళల కోటా నుండి ఆగమామిడి అనంతమ్మ నామినేషన్లు దాఖలు చేశారు. కౌన్సిల్ సభ్యులు చేయి పైకెత్తి ఆమోదం తెలపడంతో వారిని ఎన్నికైనట్లు కమిషనర్ శివాజీ ప్రకటించారు.అలాగే మైనారిటీ విభాగంలో ఖాళీగాఉన్న రెండు కోఆప్షన్ సభ్యుల స్థానాలకు పురుషుల విభాగం నుండి ఇద్దరు, మహిళల విభాగం నుండి ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం మహమ్మద్ రహమత్, సీమ సుల్తానాను కౌన్సిల్ సభ్యులు ఆమోదించడంతో వారిని ఎన్నికైనట్లు కమిషనర్ ప్రకటించారు.ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు హాజరుకాగా, వారిలో ఒకరు మధ్యలోనే వెళ్లిపోయారు. మరోవైపు 24వ వార్డు కౌన్సిలర్ తాను కొత్తవాడినని, అయోమయంలో చేయి ఎత్తానని, కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు తెలిపినట్లు కాదని స్పష్టం చేశారు. అయితే దీనిని కాంగ్రెస్ నాయకులు తమకు బీఆర్ఎస్ సభ్యుడి మద్దతు లభించినట్లుగా ప్రకటించుకున్నారు. ఎన్నికైన కోఆప్షన్ సభ్యులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అంజమ్మ, కమిషనర్ శివాజీ పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, పురపాలన అనుభవం కలిగిన మీరు ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తమ అభ్యర్థిత్వాన్ని సమర్థించి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డిలకు, సహకరించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఎన్నికైన సభ్యులు తెలిపారు.



పదవ తరగతి టాపర్‌ను సన్మానిస్తున మున్సిపల్ చైర్మన్ తదితరులు

## పదో తరగతి టాపర్‌కు ఘన సన్మానం

**గుమ్మడిదల, మే 2 (ప్రభాతవార్త):** పదో తరగతి పరీక్షల్లో 565 మార్కులు సాధించి గుమ్మడిదల మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన తేజస్వినిని శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ విద్యార్థినిని ప్రత్యేకంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సారెడ్డి పద్మారెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, గోకర్ నిర్మల, మేడిపల్లి మురళి, ఆర్ల కిషన్, బెంబడి సంజీవరెడ్డి, మద్ది సోనీ రెడ్డి, షేక్ గౌసియా, ఆకుల మాధవి, కత్తుల రమేష్, పొన్నాల ప్రమీల, సురభి కుమార్ గౌడ్, గిద్దె విజయలక్ష్మి, చూర్ణం చక్రపాణి, చప్పటి పద్మతో పాటు నాయకులు హుస్సేన్, శేఖర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు

### మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్

**గుమ్మడిదల, మే 2 (ప్రభాతవార్త):** ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ తెలిపారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇటీవల ఏర్పాటు చేసిన బోరుబావులకు శనివారం బోర్ మోటార్లు అమర్చి నీటిసరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సారెడ్డి పద్మరెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, మేడిపల్లి మురళి, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, బెంబడి సంజీవరెడ్డి, మద్ది సోనీరెడ్డి, షేక్‌గౌసియా, ఆకుల మాధవి, కత్తుల రమేష్, పొన్నాల ప్రమీల, సురభికుమార్‌గౌడ్, గిద్దె విజయలక్ష్మి, శ్రీచూర్ణం చక్రపాణి, చప్పటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణం

**కొల్చారం, మే 2 (ప్రభాతవార్త):** మాధవానంద సరస్వతి స్వామి ఆశీర్వచనాలతో, పైతర గ్రామానికి చెందిన ఎల్లుగారి రాంకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో రేపు ఉదయం 9గంటలకు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంతోపాటు నూతన కళ్యాణ మండప ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు యాబన్నగారి రవితేజ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి పాత్రికేయ మిత్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, మే 2 ప్రభాతవార్త:** అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీలో ఉచిత ప్రయాణసౌకర్యాన్ని కల్పించిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, రూ. 500 గ్యాస్ కనెక్షన్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు.అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డీవో జ్యోతి, ఆర్డిఓ రాజేందర్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, కౌన్సిలర్‌లు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, శివాజీ పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**గుమ్మడిదల, మే 2 ప్రభాతవార్త :** గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పటాన్‌చెరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని ధాన్యాన్ని నేరుగా విక్రయించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ పరమేశం, సర్పంచ్ సూరారం మంజుల, వార్డు నెంబర్లు, రైతులు,గ్రామ పెద్దలు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వీరన్నగూడెంలో ఉచిత వైద్యశిబిరం

**గుమ్మడిదల, మే 2 (ప్రభాతవార్త):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం గ్రామంలో శుక్రవారం ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఏఐజి హాస్పిటల్, తెలంగాణ ప్రభుత్వం, గ్రాన్యూల్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్న పాపనికుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, స్థానిక కౌన్సిలర్ షేక్ గౌసియా హుస్సేన్ పాల్గొన్నారు. డాక్టర్ ఎస్. మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 80 మంది మహిళలకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నివేదికలను మూడు రోజులలో అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్‌గౌడ్, మురళి, చక్రపాణి, విజయలక్ష్మి, సర్‌రెడ్డి పద్మ, అభిశెట్టి రాజశేఖర్, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, మద్ది సోనీరెడ్డి, ఆకుల మాధవి, పొన్నాల ప్రమీలతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే సూపర్‌వైజర్ లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు శశికళ, మణెమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.తదుపరి ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని మే 8న గుమ్మడిదల ప్రైమరీస్కూల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పైతర్ గ్రామంలో ఫంక్షన్ హాల్ ప్రారంభం

**కొల్చారం మే 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పైతర గ్రామంలో యెల్లుగారి రామకృష్ణారెడ్డి సొంత నిధులతో నిర్మించిన "ఫంక్షనల్ గ్రామ" ఫంక్షన్ హాల్‌ను నేడు ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆధునిక సౌకర్యాలతో ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా యెల్లుగారి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో శుభకార్యాలు, వివాహాలు, సామాజిక కార్యక్రమాలు సౌకర్య వంతంగా నిర్వహించుకునేందుకు ఈ కళ్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కళ్యాణ కార్యక్రమాన్ని కూడా ఆయనే నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుండే రామకృష్ణారెడ్డి సేవలను గ్రామ పెద్దలు, యువకులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉప్పు లింగాపూర్‌లో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళికలు.

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పులింగాపూర్, ఆరెగూడెం. వెల్దుర్తి, గ్రామాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, లింగ వివక్ష, లింగ సమానత్వం, స్త్రీద్వేషం. బాల్య వివాహాలు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జి రాజశేఖర్‌రెడ్డి హెచ్‌టియు, ఇన్‌స్పెక్టర్ కె.రామచందర్ ఎస్పై, బీసీలు చిట్టిబాబు, హెచ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు

-రూ.50వేల కోట్లతో పరిగి అభివృద్ధికి ప్రణాళికలు
-ప్రతి పైసా ప్రజలకు చేరవేస్తాం
-పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**పరిగి, మే 2, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గాన్ని 50 వేలకోట్ల రూపాయలతో సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, పరిగి నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తూ, ప్రభుత్వ ఫలాలను పారదర్శకంగా అమలు చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పరిగి పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశాన్ని నిర్వహించారు. 99రోజుల కార్యాచరణ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో అన్నిశాఖల అధికారులతో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రతిపథకం లబ్ధిదారుడికి అందేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి పైసా ప్రజలకు చేరేలా, పరిగి నియోజకవర్గ ప్రజలకు జవాబుదారీగా తాను ఉంటానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీ పథకాలు పరిగి నియోజకవర్గంలో పారదర్శకంగా అమలవుతున్నాయని తెలిపారు. పరిగి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పనులకు రూ.50,125 కోట్లతో ప్రణాళికను సిద్ధంచేసామని, ఇప్పటికే పలు అభివృద్ధి పనులను ప్రారంభించామని తెలియజేశారు. పరిగి-వికారాబాద్ కృష్ణా రైల్వేలైన్‌కు 3,600 కోట్లు, విద్యుత్ రంగంలో 400 కెవిసబ్‌స్టేషన్, పదహారు 33/11 కెవిసబ్‌స్టేషన్లకు 900 కోట్ల రూపాయలను వెచ్చించామన్నారు. సాగునీరు ప్రాజెక్టులకు పదివేలకోట్లతో లక్ష్మీదేవిపల్లి ఇరిగేషన్ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని, భూసేకరణకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పరిగి, పూడూర్ మండలాల మీదుగా ప్రాంతీయ రింగ్‌రోడ్డు కోసం రూ. 25,000 కోట్లతో పనులు జరుగుతాయని, రేడియల్ రోడ్డుకు 6వేల కోట్లు, మన్నెగూడ నుండి అప్పాజంక్షన్ వరకు వెయ్యికోట్లతో రహదారి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, అదేవిధంగా పరిగి నుండి వికారాబాద్ డబుల్ రోడ్డుకు 90 కోట్లు, పరిగి నుండి షాద్‌నగర్ డబుల్ రోడ్డుకు 120కోట్లను మంజూరుచేశామని తెలిపారు. విద్య, వైద్యం, రక్షణవిభాగంలో పూడూర్‌లో నావీ రాడార్ స్టేషన్ 3,100కోట్లతో నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ 200 కోట్లు, 100 పడకల ఆసుపత్రి 27కోట్లతో నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. మున్సిపల్, పర్యాటక అభివృద్ధికి 67 కోట్లతో పరిగి మున్సిపల్ అభివృద్ధి, కొత్త మున్సిపల్ భవనం, నీటికనెక్షన్లు, రోడ్లు, టౌన్ నగర వనం, సుల్తాన్‌పూర్ మున్సిపాలిటీలో తాగునీరు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎకో అర్బన్ పార్క్, జాఫోర్‌పల్లి 4 కోట్లు, లక్నాపూర్ 4.5కోట్లు, హెచ్ఎమ్డీఏ నిధులు పూడూర్ మండలం 10 కోట్లు, పరిగి కొత్త తహశీల్దార్ ఆఫీస్‌ను 2 కోట్లతో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల అధికారులు, సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.



-సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

## వందశాతం ఉత్తీర్ణతకు కృషీవలుడు



కె.సమ్మయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సన్మానం

**మోమిన్‌పేట్, మే 2. ప్రభాతవార్త:**

2018-19వ, సంవత్సరం నుండి 2025-26 వరకు వరుసగా పదవ తరగతి విద్యార్థులు వందకు వందశాతం ఉత్తీర్ణులుకావడంతో ఉపాధ్యాయుడు సమ్మయ్య సంతోషంతో విద్యార్థినీవిద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అప్పట్లో ఉపాధ్యాయుడు సమ్మయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా విద్యాశాఖాధికారిణి రేణుకాదేవి ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు, ఉపాధ్యాయసంఘాల సమక్షంలో జిల్లా కేంద్రంలో ఉత్తమ అవార్డు, మొమెంటో అందజేసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల(బాలుర) మోమిన్‌పేట్‌లో భౌతికశాస్త్రం బోధకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరంలో పదవ తరగతిలో 34మంది విద్యార్థులకుగాను 100% (34మంది) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో 100కు 100మార్కులు భౌతిక శాస్త్రంలో సాధించడం గర్వంగా ఉందని ఉపాధ్యాయుడు సమ్మయ్య అన్నారు. ఉపాధ్యాయుడు సమ్మయ్య కృషికి మోమిన్‌పేట మండల ఉపాధ్యాయులు తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

## నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్




బోరు మోటర్‌కు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ వేణుగోపాలాచారి

**కేశంపేట, మే 2, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో 7 వ వార్డులో గత కొంతకాలంగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు, కాలనీలో ఉన్నటువంటి నీటి సమస్యను గ్రహించిన సర్పంచ్ కాలనీవాసులకు సమస్య పరిష్కరించేందుకు శనివారం గ్రామ సర్పంచ్ వేణుగోపాలాచారి బోరుమోటర్ మరమ్మతు పనులను ప్రారంభించారు. దీంతో ఏడవ వార్డులో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజాసేవే ధ్యేయంగా గ్రామంలోని సమస్యల పరిష్కారానికి ముందుండి చర్యలు తీసుకుంటున్న సర్పంచ్ వేణుగోపాలచారిని గ్రామస్థులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సయ్యద్ సలీం, సువర్ణరామచంద్రయ్యతోపాటు కాలనీవాసులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కోఆప్షన్ మెంబర్లను ఎన్నుకున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు




కోఆప్షన్ మెంబర్లు, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి

**పరిగి, మే 2, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా, పరిగి మున్సిపాలిటీలో నలుగురిని కోఆప్షన్ సభ్యులుగా కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనార్టీ నుంచి అక్బర్ హుస్సేన్, క్రిస్టియన్ మైనారిటీ నుంచి కమల ఆనంద్, ఎక్స్ అఫిషియో (జెనరల్) నుంచి ఆనం ఆంజనేయులు, ఎక్స్ అఫిషియో సీనియర్ సిటిజన్ నుంచి ఫిరంగి పద్మలను కోఆప్షన్ సభ్యులుగా శనివారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలని, పట్టణ అభివృద్ధికి సలహాలను అందించాలని కో ఆప్షన్ సభ్యులకు తెలియజేశారు.. రాబోయే రోజుల్లో పరిగి మున్సిపల్ పరిధిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రజిత వెంకటేష్, వైస్‌చైర్మన్ కమల్, కౌన్సిలర్లు, కమిషనర్ వెంకటయ్య పాల్గొన్నారు.

## ట్రస్మా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌కు, కౌన్సిలర్‌కు ఘనంగా సన్మానం



ఎన్నికల్లో గెలుపొందినవారిని గోనె హన్మంత్‌రెడ్డి సన్మానించిన దృశ్యం

**శామీర్‌పేట, మే 2, ప్రభాతవార్త:**

ఇటీవల జరిగిన అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డిని, కౌన్సిలర్ దీపికవరప్రసాద్‌రెడ్డిలను తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) వారు ఘనంగా సన్మానించి సత్కరించారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో తుర్కపల్లిలోని సెంట్ మేరిస్ హైస్కూల్ కరస్పాండెంట్ 4వవార్డు కౌన్సిలర్‌గా దీపికవరప్రసాద్‌రెడ్డి, లాల్‌గడి మలక్‌పేట్‌లోని సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ 5వ వార్డు కౌన్సిలర్‌గా కె.మాలతిమాదవరెడ్డి(వైస్‌చైర్మన్‌గా) ఎన్నికకావటంతో మర్యాదపూర్వకంగా వారిని ట్రస్మా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులు గోనె హనుమంతరెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. శామీర్‌పేటమండల ప్రైవేట్‌స్కూల్స్ ట్రెజరర్ దివ్యజ్యోతి ఆధ్వర్యంలో పలువురు ప్రైవేట్‌స్కూల్స్ యాజమాన్యాల కరస్పాండెంట్స్ పాల్గొని సన్మానించి అభినందనలు తెలియజేశారు. ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ ప్రజాప్రతినిధులుగా ఎన్నికకావటం అభినందనీయమని రాష్ట్ర ఉపాధ్యక్షులు గోనె హనుమంతరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మాసభ్యులు శివశంకర్, పంచాక్షరి, సూరజ్, వై.వరప్రసాద్‌రెడ్డి, కె.మాదవరెడ్డి, శామీర్‌పేట మండలంలోని వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రిన్సిపల్స్‌లు పాల్గొని వారిని అభినందించారు.

## విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

-పల్లెబ్రదర్స్ విద్యపై వారికి ఉన్న మమకారాన్ని చాటుకున్నారు

**కేశంపేట, మే 2, ప్రభాతవార్త:**

కేశంపేట మండలపరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదవతరగతి చదివిన 16మంది విద్యార్థినీవిద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ ఉత్తీర్ణులు కావడంతో శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించిన సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలీశ్వర్‌లు విద్యపై వారికున్న మమకారంతో తమ సొంత నిధులతో విద్యార్థులకు ఉచితసైకిళ్లను పంపిణీచేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ పల్లెబ్రదర్స్ గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పల్లె బ్రదర్స్ గ్రామానికి చేస్తున్న సేవలు చిరస్థాయిగా ప్రజల మనసుల్లో నిలిచిపోతాయని అందరం రుణపడి ఉంటామని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీతిరుమలనాథస్వామి ఉత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, తదితరులు

**పూడూరు, మే 2, ప్రభాతవార్త:**

పూడూరుమండలం పరిధిలోని రాకంచెర్లలో వెలసిన శ్రీతిరుమలనాథ స్వామి (యోగానంద లక్ష్మీనర్సింహ్మస్వామి)వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారంరాత్రి శ్రీతిరుమలనాథ స్వామివారి కళ్యాణం, రథోత్సవం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో పాల్గొని బాజాభజంత్రీల మధ్య శ్రీస్వామివారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. ఊరేగింపుగా వెళ్లే రథానికి భక్తులు దండలు వేస్తూ, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు కొడుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ్మ స్వామివారి కళ్యాణంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొని, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా వివిధగ్రామాల భజన మండలులు పాల్గొని శ్రీరాకంచెర్ల వెంకటదాసులవారి సంకీర్తనలను ఆలపించారు. దీంతో గ్రామమంతా శ్రీలక్ష్మీనర్సింహ్మస్వామియేనమః నామస్మరణతో మార్మోగింది. శనివారంరాత్రి శ్రీస్వామివారి దీపోత్సవం, సహస్ర పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

## శ్రద్ధతో చదివితే ఉన్నత ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు సునీత

**జిల్లెడు చౌదరిగూడ, మే 2, ప్రభాతవార్త:**

విద్యార్థులు శ్రద్ధతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. శనివారం పాఠశాలలో పదవతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శాలువాలతో సన్మానకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మండల టాపర్‌లుగా తమ విద్యార్థులు నిలవడం ఎంతో సంతోషకరమని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను సర్పంచ్ శ్వేతచంద్రబాబుగౌడ్, ఉపసర్పంచ్ అజ్జు, ఎజాజ్‌ఆలీ, దామోదర్, పాఠశాల చైర్మన్ లక్ష్మిలు విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు.

## ఆంజనేయస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠ

**తలకొండపల్లి, మే 2, ప్రభాతవార్త;**

తలకొండపల్లి మండలపరిధిలోని చౌదర్పల్లిగ్రామంలో నూతనంగా ఆంజనేయస్వామి దేవాలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలందరూ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన, దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన మహా సుదర్శన యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలంగా భక్తికి సంబంధించిన తదితర కార్యక్రమాలతో గ్రామం మారుమోగింది. ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలనే సర్పంచ్ భారతమ్మ తెలిపారు.

## అమరవాది లక్ష్మీనారాయణను కలిసిన ఉప్పల వెంకటేష్



లక్ష్మీనారాయణ సన్మానిస్తున్న ఉక్కుల వెంకటేష్

**తలకొండపల్లి మే 2, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావది లక్ష్మీనారాయణను శనివారం మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్, ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ కలిశారు. శనివారం హైదరాబాదులో ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ కమిటీ నూతన రాష్ట్ర అధ్యక్షులుగా అమరావది లక్ష్మీనారాయణ ఎన్నికకావడంతో ఉప్పల వెంకటేష్ కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల హక్కుల కోసం నిరంతరం కృషిచేయాలని, రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు మొత్తం అండగా ఉంటారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతంచేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

**దుద్యాల్, మే 2, ప్రభాతవార్త:**

కొడంగల్ మండలంలోని ఎరన్‌పల్లిలో ఈ నెల 6న నిర్వహించనున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం దుద్యాల్ మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగిస్తారని, రేలారే ప్రసాద్, రజినిసాయిచంద్ వంటి ప్రముఖులు హాజరవుతారని అన్నారు. కావున నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళితసంఘాల నాయకులు రమేష్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, సంగప్ప, బుస్స చంద్రయ్య, గోకుల్‌సింగ్, గ్రామస్థులు నజీర్, బసిరెడ్డి, నరేష్‌గౌడ్, మేర్గు శ్రీకాంత్, కొత్త నరసింహులు, సాయికుమార్, అంజి పాల్గొన్నారు.

## ఐమ్యాక్స్ వీధిదీపాల ఏర్పాటు

**షాద్‌నగర్, మే 2, ప్రభాతవార్త:**

పట్టణంలోని 1వ, 12వ, 13వ వార్డు పోలీమేరలో వర్కింగ్ ప్రెసిడెంట్ ముబారక్ అలీఖాన్, కౌన్సిలర్ కల్యాంకర్ దిలీప్ ఆధ్వర్యంలో ఐమాక్స్ లైట్లను ఏర్పాటుచేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సౌకర్యార్థం మరో కీలక అభివృద్ధి కార్యక్రమం చేపట్టారు. ఐమ్యాక్స్ వీధిదీపాలను ఏర్పాటుచేసే పనులు వర్కింగ్ ప్రెసిడెంట్ ముబారక్ అలీఖాన్, 12వ వార్డు కౌన్సిలర్ కల్యాంకర్ దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రజలభద్రత, సౌకర్యందృష్ట్యా వీధిదీపాల ఏర్పాటు ఎంతో అవసరమని నాయకులు తెలిపారు. స్థానికప్రజలు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ, తమప్రాంతంలో మౌలికసదుపాయాల అభివృద్ధి కొనసాగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

# మాదాయపల్లి అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి




ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ గుల్ల సుధాకర్

**తలకొండపల్లి, మే 2, ప్రభాతవార్త;**

తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయపల్లి గ్రామసర్పంచ్ గుళ్ళ సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామానికి నిధులు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి నిధులు ఇవ్వాలని కోరుతూ పలు మార్లు వినతులు ఇచ్చినా, స్పందించడం లేదని మాదాయపల్లి సర్పంచ్ గుల్ల సుధాకర్ తెలిపారు. శనివారం కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా నియోజవర్గస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి సర్పంచ్ గుల్ల సుధాకర్ హాజరైనారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి మరోమారు గ్రామానికి సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్, మొదలగు అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని నిధులు ఇవ్వాలని వినతిపత్రంలో నట్లు ఆయన తెలిపారు. అనేకసార్లు ఎమ్మెల్యే నారాయణరెడ్డిని గ్రామ అభివృద్ధికి మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేయాలనికోరినా, స్పందించడం లేదని, ఇప్పటికైనా ఎన్నో సమస్యలతో కూడుకున్న మాదాపల్లి గ్రామానికి అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ఆ వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుల్ల సుధాకర్, ఉపసర్పంచ్ చిల్కం ఆంజనేయులు, తుడుం భాస్కర్ ఉన్నారు.

## విద్యార్థులే భావి భారత పౌరులు

-పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న మాజీసర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి

**కేశంపేట, మే 2, ప్రభాతవార్త:**

నేటి విద్యార్థులే రేపటి భావితరాలకు పునాదులని పాపిరెడ్డి కూడా మాజీసర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు మార్గదర్శకాలుగా ఉంటున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. పాపిరెడ్డిగూడ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చదువుతూ ఫస్ట్‌క్లాస్ మార్కులతో విజయం సాధించిన కీర్తన, స్కూల్ సెకండ్ వచ్చిన సంజనలను ప్రత్యేకంగా అభినందిస్తూ చిరుకానుకగా డిక్షనరీలు, పెన్నులను అందజేశారు. అనంతరం విద్యార్థులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాపిరెడ్డిగూడ ఉపసర్పంచ్ జ్యోతినరేందర్‌రెడ్డి, వార్డుసభ్యులు నరేందర్, రామకృష్ణ, ప్రవీణ్, కృష్ణారెడ్డి, సూరమురి శంకర్, రమేష్, సాయిమణి, అబ్బి రవి, అల్వాల రాజు, అనిల్, గొల్ల ఆంజనేయులు, మేదరి రామస్వామి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎన్నిక

**శామీర్‌పేట, మే 2, ప్రభాతవార్త:**

లయన్స్ మల్టిపుల్‌కౌన్సిల్ చైర్మన్‌గా ఎ.అమరనాథ్‌రావు ఎన్నికయ్యారు. శనివారం శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో కౌన్సిల్‌చైర్మన్ ఎన్నిక జరిగింది. లయన్స్ అంతర్జాతీయ సేవాసంస్థ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న 8లయన్స్ జిల్లాలకు చెందిన 320మల్టిపుల్ కౌన్సిల్ 11వ చైర్మన్‌గా 320డి జిల్లా గవర్నర్ లయన్ ఎ.అమర్‌నాథ్‌రావు ఎన్నికైనట్లు ప్రస్తుతచైర్మన్ టి.రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన మే 2,3తేదీల్లో మల్టిపుల్ పదవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎన్నికకావటంపట్ల మల్టిపుల్ అగ్రనాయకులు డా.బాబురావు, ఆర్.సునీల్ కుమార్, జిల్లాల గవర్నర్లు, వైస్‌గవర్నర్లు, పూర్వ గవర్నర్లు, మల్టిపుల్ పిఆర్‌ఓ కన్న పర్శరాములు, 320డి జిల్లా క్యాబినెట్‌కార్యదర్శి ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి మర్రి ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొని అభినందనలు చైర్మన్ ఎ.అమరనాథ్‌రావుకు తెలిపారు.

## విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

-ఎడిఎ శంకర్ రాథోడ్



మాట్లాడుతున్న ఎడిఎ శంకర్ రాథోడ్

**కొడంగల్, మే 2, ప్రభాతవార్త:**

డివిజన్ పరిధిలోని రైతులందరూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శంకర్ రాథోడ్ తెలిపారు. శనివారం ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా మే 4 నుండి 9వ తేదీవరకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతువారం, అగ్రికల్చర్ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయంతం చేసేందుకు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులకు(ఎంఎడి) తగినదిశానిర్దేశంతో పలుసూచనలు చేశారు. అలాగే నిర్దేశించిన గడువులోగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు అందరూ తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను, వ్యవసాయ అధికారులను సంప్రతించి తమపేరు నమోదు ప్రక్రియను త్వరగా పూర్తిచేసుకోవాలని కోరారు.

## టిఎన్జీవో తాలూకా అధ్యక్షుడికి కాలనీ అభివృద్ధి కమిటీ ఘన సన్మానం



టిఎన్జీవో తాలూకా అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, మే 2, ప్రభాతవార్త:**

టిఎన్జీవో షాద్‌నగర్ తాలూకా అధ్యక్షుడిగా ఎన్నికైన హెల్త్ ఎడ్యుకేటర్ జక్కుల శ్రీనివాసులకు సాయిబాబా కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనసన్మాన కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గల సాయిబాబా కాలనీలోని శివాలయప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి కాలనీవాసులు, పెద్దలు, యువకులు భారీసంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు. కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు మంగ శంకర్ (ఏ.ఎస్.ఎస్.జీ) అధ్యక్షత వహించగా, సమన్వయకర్త డాక్టర్ కొమ్ము వెంకన్నబాబు, ప్రధానకార్యదర్శి బొబ్బిలిగ్రామ శ్రీనివాసులు సమగ్రంగా ఏర్పాట్లు చేశారు. అనంతరం జక్కుల శ్రీనివాసులకు పూలమాలలు, శాలువాలతో ఘనసన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎ.ఆంజనేయులుగౌడ్, మాజీ అధ్యక్షులు బోర్వెల్ శ్రీరాములుగౌడ్, అమర్నాథ్‌రెడ్డి, నాట్కో చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది బెన్నూరి చంద్రయ్య, టిఆర్ఎస్ పార్టీ యువనాయకుడు 26వ వార్డు కౌన్సిలర్ బి.శివ (ఎస్‌పి), రామిరెడ్డి, డీసీఎం సుధాకర్‌రెడ్డి, ఐటి రాజేష్‌కుమార్, గుంటి రమేష్, మందారం నరసింహులు, రిటైర్డ్ ఆర్టీసీ బాలస్వామి, రమణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, క్యాషియర్ శ్రీశైలం, పోలీస్ రవి, విష్ణు (లడ్డు), సతీష్, కుమార్, అజయ్, బోల్ట్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## యోగ ఆరోగ్య సంజీవిని..!

-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కన్హ శాంతి వనంలో జరిగిన యోగాలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

**నందిగామ, మే 2, ప్రభాతవార్త:**

భారతదేశానికి యోగ పుట్టినిల్లని, ప్రతి ఒక్కరూ యోగా సాధన లవర్చుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. నందిగామ మండలం కన్హ శాంతి వనంలో శనివారం జరిగిన 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం లో పాల్గొన్నారు. నిత్య జీవితంలో యోగ ప్రతి ఒక్కరికి అవసరమని, యోగాతో దేహదార్ఢ్య పెంపొందడంతో పాటు ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, మనోధైర్యం, జ్ఞానాన్ని పొందవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరు యోగాను అలవర్చుకొని తమ జీవితాలను వెలిగించుకోవాలన్నారు.